

ఘనంగా వసంతోత్సవం

ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను అశ్వ వాహనంపై ఊరేగించారు. -8లో



27 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
40.2/28.5

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 28.5 - 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అంధత్వ నివారణకు కృషి చేయాలి



కడప రిమ్స్ ఆప్తాలమిక్ విభాగాన్ని పరిశీలిస్తున్న ఎన్‌పీసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్

కడప అర్బన్: జిల్లాలో అంధత్వ నివారణకు ప్రతి ఒక్క వైద్యుడు కృషి చేయాలని నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్ తెలియజేశారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆప్తాలమిక్ ఓపీ విభాగంలో పరికరాలను పరిశీలించారు. వైద్య విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జిల్లా అంధత్వ నివారణ సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అంధత్వ నివారణ కోసం చేపడుతున్న, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో కడప రిమ్స్ ఆప్తాలమిక్ హెచ్‌ఓడీ డాక్టర్ కిరణ్మయి, జిల్లా అంధత్వ నివారణ సొసైటీ అధికారి డాక్టర్ సునీత, డాక్టర్ వెంకటయ్య, ఆప్తాలిమిక్ ఆఫీసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో కీలక స్థానంలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు కష్టపడి కాకుండా ఇష్టపడి విధులు నిర్వహించాలని అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలోని ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో అత్యల్ప ఇంధన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విధుల ద్వారా సంస్థ పురోభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అధిక కేఎంపీఎల్ సాధించవచ్చని, ప్రయాణీకుల అభిమానాన్ని సంపాదించవచ్చని తెలిపారు. అనంతరం ఇన్‌స్ట్రక్టర్ హనీఫ్ పంచసూత్రాలను డ్రైవర్లకు వివరించి వాటి వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డిపో మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీరింగ్ అధికారులు, బద్వేలు, మైదుకూరు, మదనపల్లె ఎస్‌డీఐలు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంబేపల్లి: సంబేపల్లె మండల పరిధిలోని పొట్టిరెడ్డిగారిపల్లిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి శుక్రవారం పరిశీలించారు.అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ నెల నుంచి సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. నీటి నిలువ ఉన్న వాటిలో అబేట్ వేయాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు వస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారులు వై ప్రసాద్ యాదవ్,ఎస్ జయరామయ్య, వైద్య సిబ్బంది బి రవిశంకర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం పరిశీలన



వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలోని ఉక్కాయపల్లెలో ఉన్న కేఎంసీ పరిధిలోని వర్మీ కంపోస్టింగ్ తయారీ కేంద్రాన్ని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్య బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్మీ కంపోస్టు అనేది కుళ్లిపోతున్న కూరగాయలు లేదా ఆహార పదార్థాల వ్యర్థాలు, వర్మీకాస్ట్ మిశ్రమాన్ని రూపొందించడానికి వివిధ రకాల పురుగులు, ఇతర వాన పాములను ఉపయోగించి కుళ్లిపోయే ప్రక్రియ ఉత్పత్తి నుంచి ఎరువుగా తయారు చేస్తారన్నారు. ఈ ఎరువు 60 రోజుల్లో పాడి చెత్త నుంచి ఎరువుగా తయారు చేస్తారని వారు తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత, శిక్షణా వైద్యులు రామకృష్ణ నాయక్, ఆదినారాయణ, లావణ్య, నవ్యశ్రీ, రవికుమార్‌రెడ్డి, హుసేన్‌ఖాన్, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

- స్కూళ్ల పునః ప్రారంభానికి ముందే జిల్లాకు చేరిక
- 8 నుంచి పదో తరగతి వరకు నేరుగా మండల స్టాక్ పాయింట్లకు
- ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా స్టాక్ పాయింట్‌కు



కడప పాఠ్యపుస్తకాల గోడౌన్ నుంచి మండల కేంద్రాలకు తరలించే వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్: గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉండేది. పాఠ్యపుస్తకాల కోసం విద్యార్థులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. విద్యా సంవత్సరం ముగిసే దశలోనూ పూర్తి స్థాయిలో అందేవి కావంటే క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ తరుణంలో 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నాడు–నేడుతో మౌలిక వసతులు.. విద్యాకానుక పేరుతో విద్యార్థులకు తొమ్మిది రకాల వస్తువులు.. జగనన్న గోరుముద్ద...తదితర పథకాలతో ప్రభుత్వ పాఠశాలల వైపు ఎక్కువ మంది మొగ్గు చూపేలా చర్యలు చేపట్టారు. తాజాగా పాఠశాలల పునః ప్రారంభం నాటికే పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ప్రతి విద్యార్థి చేతిలో పాఠ్య పుస్తకం ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ మార్చి నెల నుంచి చర్యలను ప్రారంభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నాలుగు దఫాలుగా క్రమం తప్పకుండా నాణ్యతతో కూడిన విద్యాకానుకను విజయవంతంగా విద్యార్థుల చేతికి అందచేసింది. అదే ఒరవడితో ఈ ఏడాది కూడా పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్లు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ సంవత్సరం ఏప్రిల్‌లోనే నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు జిల్లా గోదాంకు రావడం ప్రారంభించాయి. 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుక్తకాల కవర్‌పేజీలను మార్పులు చేసి ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. వీటిపై క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. దీని ద్వారా పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారాన్ని విద్యార్థులు పొందవచ్చు.

పుస్తకాల భారం నుంచి విముక్తి

పుస్తకాల బరువుతో విద్యార్థుల వెన్నెముకపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తోంది. గత సంవత్సరం 1 నుంచి 9వ తరగతి వరకు సెమిస్టర్ విధానాన్ని అమలు చేయగా ఈ ఏడాది నుంచి పదో తరగతికి కూడా అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా గణితం, సైన్స్ సబ్జెక్టులను రెండు సెమిస్టర్లుగా విడదీశారు. సిలబస్ మొత్తాన్ని జూన్ నుంచి అక్టోబర్ వరకు సెమిస్టర్–1గా.. నవంబర్ నుంచి మార్చి వరకు సెమిస్టర్–2గా విభజించారు. దీంతోపాటు 1 నుంచి 10వ తరగతుల పాఠ్యపుస్తకాల్లో బైలింగ్వల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఒక పేజీలో ఇంగ్లిషు, ఒక పేజీలో తెలుగు పాఠ్యాంశాన్ని ముద్రించి ఇవ్వడం వల్ల విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే వీలు ఉంటుంది.

రెండు విధాలుగా పుస్తకాల సరఫరా..

ఈ ఏడాది పాఠ్యపుస్తకాలను రెండు విధాలుగా సరఫరా చేస్తున్నారు. 1 నుంచి 7వ తరతగతి వరకు పాఠ్యపుస్తకాలు, వర్క్ పుస్తకాలు నేరుగా పుస్తక గోదాం నుంచి జిల్లా స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్నారు. 8, 9, 10 తరగతులకు ప్రభుత్వ అనుమతి పొందిన ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్నారు.

15,02,507 పుస్తకాలు అవసరం..

ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాకు 15,02,507 పుస్తకాలు అవసరం కాగా గతేడాది పంపిణీ చేయగా మిగిలిన గ్రౌండ్ బ్యాలెన్స్ 2,45,042 పుస్తకాలు కడపలోని గొడేన్‌లోనే స్టాక్ పెట్టారు. ఇవి పోను ఈ సంవత్సరం 12,57,465 పుస్తకాలు అవసరమని గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు 5,70,956 పుస్తకాలు కడప గోడౌన్‌కు చేరాయి. ఇంకా 6,86,512 పుస్తకాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం కడప గోదాంలో ఉన్న పుస్తకాలను ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా మండలాలకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 40 మండలాల్లో ఉన్న పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను తరలించారు.

8,9,10 తరగతులకు సంబంధించి..

8,9,10 తరగతులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రింటర్స్ నుంచి నేరుగా మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇందులో 8వ తరగతికి సంబంధించి 1,57,294, 9వ తరగతికి 2,01,720, 10వ తరగతికి 1,70,869 పుస్తకాలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 9,10 తరగతులకు సంబంధించి 42,290 పుస్తకాలు మాత్రమే కడప మండలానికి వచ్చాయి. మిగతావి రెండు మూడు రోజుల్లో రానున్నాయి.



కడప గోడౌన్‌లో నిల్వ ఉన్న పాఠ్యపుస్తకాలు

పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాల అందజేత..

వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునః ప్రారంభించే రోజే పిల్లలందరికీ పాఠ్యపుస్తకాలను అందజేస్తాం. ప్రస్తుతం జిల్లాలో 5,70,956 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 2 లక్షల 94 వేల పాఠ్య పుస్తకాలను మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు తరలించాం. మిగతా పాఠ్యపుస్తకాలు కూడా త్వరలో వస్తాయి. వాటిని కూడా మండల కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టాం.

- మర్రెడ్డి అనురాధ,
జిల్లా విద్యాశాఖ అధికారి

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఆర్వో గంగాధర్‌గౌడ్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: 'డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్' నియామకాలకు జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధరగౌడ్ ఆదేశించారు. కలెక్టరేట్ ని తన ఛాంబర్‌లో పరీక్షల పర్యవేక్షకులు పీవీ.నవజ్యోతి, ఎ.నాగలక్ష్మిలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు కడపలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, కేఓఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కేఎల్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్(ఉమెన్), ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 25న ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి 08.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్ వైజర్లు, పోలీసుల సమన్వయంతో అక్రమాలకు తావివ్వకుండా పరీక్ష జరిగేలా చూడాలన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలే అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పది పరీక్షకు 581 మంది, ఇంటర్‌కు 3532 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు నిర్ణీత సమయానికే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఇంటర్‌కు సంబంధించి ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు జరిగాయి.పదో తరగతికి ఉదయం పూట మాత్రమే నిర్వహించారు.

- పదో తరగతికి సంబంధించి తెలుగు పరీక్షకు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 16 పరీక్ష కేంద్రాల్లో 1098 మంది హాజరు కావాల్సి ఉండగా 581 మంది హాజరయ్యారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా డీఈఓ మర్రెడ్డి అనురాధ కడప జయనగర్‌కాలనీలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పరీక్షలు ప్రశాతం వాతావరణంలో జరిగాయని తెలిపారు.
- ఇంటర్‌కు సంబంధించి మొదటి రోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి.ఉదయం సెషన్‌లో 37 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌కు సంబంధించి 3000 మందికి 2821 మంది హాజరయ్యారు.ఒకేషనల్‌కు సంబంధించి 546 మందికి 502 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 20 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌కు సంబంధించి 122 మందికి 111 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 103 మందికి 98 మది హాజరయ్యారు.ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య కడపలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

గజవాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం: రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఈఓ నరసయ్య, సింగిల్ విండో చైర్మన్ బాలనాగిరెడ్డి, భక్తులు స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు పట్టాబి సీతారామిరెడ్డి, జనార్దన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో బ్రహోత్సవాలలో భాగంగా శనివారం పుష్ప రథోత్సవం (తిరునాల) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థానముల చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఈఓ టీవీ నరసయ్య ఆదివారం తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై శ్రీ చెన్నకేశవ, సంజీవరాయస్వామి వార్లను దర్శించుకుంటారన్నారు. 11 గంటల సమయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు చేసిన తర్వాత రథంలో స్వాములను ఆశీనులు చేసి గ్రామంలోని పురవీధుల్లో ఉరేగిస్తారన్నారు.స్వామి వారిని క్యూలో దర్శించుకోవడానికి ఆలయం వెలుపల బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తులను ఊరేగించనున్న రథాన్ని శుభ్రం చేశారు.




వెల్లాలలో గజ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

కౌంటింగ్ ఏజెంట్లే కీలకం

- జూన్ 4న కడపలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ వర్సిటీలో కౌంటింగ్





కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు కడప సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ(మను)లో కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పోలింగ్ ఒక ఎత్తయితే, ఎన్నికల ప్రక్రియలో చివరిదైన కౌంటింగ్ మరో ఎత్తు. కౌంటింగ్ సమయంలో అభ్యర్థి తరపున ప్రతినిధిగా వ్యవహరించే కౌంటింగ్ ఏజెంట్ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు సాయంత్రం 5 గంటల్లోపు కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించిన ఫారం–18 సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఎన్నికల రూల్స్–1961 ప్రకారం అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్ ఆమోదంతో కౌంటింగ్ ఏజెంట్లను నియమిస్తారు. ఫారం–18 భర్తీ చేసి ఫొటో జతపరిచి ఒక కాపీ అభ్యర్థి లేదా తన ఎన్నికల ఏజెంటు ద్వారా, మరో కాపీ కౌంటింగ్ ఏజెంట్ ద్వారా ఆర్వోకు సమర్పించాల్సి ఉంటుంది. ఆర్వోలు కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ కార్డులు తయారు చేసి పంపుతారు. కౌంటింగ్‌కు గంట ముందు అపాయింట్మెంట్ లెటర్, ఐడీ కార్డు ఆర్వోలకు సమర్పించాల్సి ఉంటుంది. ఫారం–19 ద్వారా కౌంటింగ్ ఏజెంట్ అపాయింట్మెంట్‌ను రద్దు చేసే అధికారం అభ్యర్థి లేదా ఎలెక్షన్ ఏజెంట్‌కు ఉంటుంది. కొత్త కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల సంఘం అనుమతి పొందిన వ్యక్తులు, పరిశీలకులు, ఎన్నికల విధులతో సంబంధం కలిగిన ఉద్యోగులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయిస్తారు. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో కౌంటింగ్ జరుగుతుంది. ఏఆర్‌ఓకు కూడా కౌంటింగ్ నిర్వహించే అధికారం ఉంటుంది. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు తీసుకు వెళ్లరాదు. పెన్ను, పేపరు, 17–సి డూప్లికేట్ కాపీ (అకౌంట్ ఆఫ్ ఓట్స్) తీసుకెళ్లవచ్చు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు ఉన్న పార్టీలు, రిజిస్టర్ అయి గుర్తింపు పొందని పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్ టేబుల్స్ వద్ద ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి సీటింగ్ అరేంజ్‌మెంట్స్ ఉంటాయి. పొగతాడం నిషేధం. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో కౌంటింగ్ హాలు నుంచి ఏజెంట్లు బయటికి వెళ్లేందుకు అనుమతి ఉండదు. ఫలితాలు వెలువడిన తర్వాత వెళ్లవచ్చు.

ఏజెంట్లకు అవగాహన అవసరం

ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో నిర్వహించిన ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనల పట్ల కౌంటింగ్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలి. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పనిచేసే విధానంపై అవగాహన తప్పనిసరి. ఈవీఎంలు, వీవీ ప్యాట్లలో నిక్షిప్తమై ఉన్న ఓట్లను లెక్కించే ప్రక్రియ గురించి తెలుసుకోవాలి. పోస్టల్ బ్యాలెట్లు, ఎలక్ట్రానికలీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీ పీబీఎస్) లెక్కింపు గురించి తెలిసి ఉండాలి.

మార్గదర్శకాలు ఇవీ..

వాస్తవంగా కౌంటింగ్ ఏజెంట్లకు ఫలానా అర్హతలు ఉండాలని చట్టం ఎక్కడా పేర్కొనలేదు. అభ్యర్థులు 18 సంవత్సరాలు నిండిన వారిని ఏజెంట్లుగా నియమించుకుంటే వారు కౌంటింగ్ సక్రమంగా వీక్షించేందుకు వీలుంటుంది. సాయుధ రక్షణ కలిగిన వ్యక్తులను కౌంటింగ్ హాలులోకి అనుమతించరాదని ఈసీఐ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్, జెడ్పీ చైర్మన్లు, పబ్లిక్ రంగ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఏజెంట్లుగా కూర్చొనేందుకు అనర్హులు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందేవారు, ప్రభుత్వ–ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే పార్ట్‌టైమ్ ఉద్యోగులు, పారా మెడికల్ స్టాఫ్, ఎఫ్‌పీ షాపు డీలర్లు, అంగన్వాడీ ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లుగా ఉండరాదు. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఏజెంట్లుగా వ్యవహరిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951 సెక్షన్ 134(ఏ) ప్రకారం శిక్షార్హులవుతారు. వీరికి మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది. సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చొనేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. భారత పౌరసత్వం కలిగిన ఎన్ఆర్ఐలు కూడా కూర్చొవచ్చు. ప్రభుత్వ గన్‌మెన్ సౌకర్యం ఉన్న వారు ఎన్నికల ఏజెంట్‌గా, కౌంటింగ్ ఏజెంట్‌గా ఉండరాదు. అలాంటి వ్యక్తి సెక్యూరిటీతోగానీ, సెక్యూరిటీ లేకుండాగానీ కౌంటింగ్ హాలులోకి ప్రవేశించరాదు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తనకున్న సాయుధ రక్షణను స్వచ్ఛందంగా వదులుకుంటే కౌంటింగ్ హాలులో కూర్చొనేందుకు అనుమతిస్తారు. ఒక కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు, ఒక ఆర్వో టేబుల్ కలిపి మొత్తం 15 టేబుళ్లు ఉంటాయి. ఆ మేరకు అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్లు, ఈటీపీబీఎస్ లెక్కింపునకు అదనపు టేబుల్ అవసరమని భావిస్తే అందుకోసం వేరే కౌంటింగ్ హాలులో అదనపు టేబుల్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడు అభ్యర్థులు అక్కడ అదనంగా మరో కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.

క్లుప్తంగా

ఆల్విన్ దగ్ధం



మంటలలో కాలిపోతున్న ఆల్విన్ లారీ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె పంచాయతీ లింగాలదిన్నెపల్లె దగ్గర శుక్రవారం అర్ధరాత్రి ప్రొద్దుటూరు నుంచి పోరుమామిళ్లకు టమోటా లోడ్‌తో వెళ్తున్న ఆల్విన్ లారీ అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. లారీడ్రైవర్ కిందకు దిగి పోరుమామిళ్ల అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

రాజుపాళెంలో రక్షణ కటువకు నిప్పు



కాలిపోయిన రక్షణ కటువ

చాపాడు : మండలంలోని రాజుపాళెం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ వర్గీయులు నలసింగ్ రవి శంకర్ యాదవ్, సుబ్బరాయుడు యాదవ్ తమ పొలాలకు ఏర్పాటు చేసిన రక్షణ కటువకు దుండగులు శుక్రవారం నిప్పు పెట్టారు. గత కొన్నేళ్లుగా రహదారి మధ్య ఉన్న చెట్లకు నిప్పు పెట్టడంతో వివాదాలకు ఆజ్యం పోసినట్లేనని స్థానికులు తెలిపారు. టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

శునకాల స్వైర విహారం



ఎర్రగుంట్ల వీధులలో తిరుగుతున్న కుక్కలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో శునకాలు స్వైర విహారం చేశాయి. ఎక్కడ చూసినా వీధులలో గుంపుగా తిరుగుతుండటంతో ప్రజలు రాకపోకలు సాగిస్తే ఎక్కడ దాడి చేస్తాయోనని భయ పడుతున్నారు. పిల్లలను బయటకు పంపడం లేదు. వాహనదారుల వెంట పడుతుండడంతో అదుపు తప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను లేకుండా చేయాలని వారు కోరారు.

మే 27 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్

రుసుం చెల్లింపునకు జూన్ 2వ తేదీ వరకు గడువు

కడప ఎడ్యుకేషన్ : పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు [illegible] వెబ్‌సైట్‌లో చెల్లించి రసీదు పొందాలి.

హెల్ప్‌లైన్ సెంటర్ వివరాలివీ....

విద్యార్థులు రుసుము చెల్లించిన తరువాత ధ్రువపత్రాల పరిశీలనకు తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఈ నెల 27వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం సకలు పత్రాలతో రావాల్సి ఉంటుంది. కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, పొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్, రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను హెల్ప్‌లైన్ సెంటర్లుగా ఏర్పాటు చేశారు. ఎస్టీ విద్యార్థులకు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లోనూ, స్కౌట్, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పీహెచ్ మరియు క్యాప్ విద్యార్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోనూ కౌన్సెలింగ్ ఉంటుంది.



హెల్ప్‌లైన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

విద్యార్థులు తీసుకురావాల్సిన పత్రాలు

- కౌన్సిలింగ్ ఫీజు రసీదు
- ఏపీ పాలిసెట్ హాల్‌టికెట్
- పాలిసెట్ ర్యాంకు కార్డు
- 10వ తరగతి మార్కుల జాబితా (ఒరిజినల్ లేదా నెట్ కాఫీ)
- 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు
- ఓసీ కేటగిరీ వారికి 2024–25 ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్
- ఇన్‌కం సర్టిఫికెట్(01.01.2021 నుంచి)
- కుల ధ్రువీకరణ పత్రం
- ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ)

ర్యాంకుల వారీగా కౌన్సిలింగ్ ఇలా...

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
27.05.2024	1	12000
28.05.2024	12001	27000
29.05.2024	27,001	43000
30.05.2024	43001	59000
31.05.2024	59,001	75000
01.06.2024	75,001	92,000
02.06.2024	92,000	1,08,000
03.06.2024	1,08,001	చివరిర్యాంకు

విద్యార్థులు ఆప్షన్లు ఎంచుకోవచ్చు



ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తరువాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఈ నెల 27వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి. వెరిఫికేషన్ పూర్తయిన తరువాత మొబైల్ నెంబర్‌కు లాగిన్ ఐడీ వస్తుంది. రిజిస్టర్ మొబైల్ నెంబర్ వచ్చిన లాగిన్ ఐడిలో ఆప్షన్స్ పెట్టుకోవచ్చు. పూర్తి వివరాలకు httpr://appoycet.nic.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలి.

– సీహెచ్ జ్యోతి, ప్రిన్సిపల్, కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



ఎదర్శనను తిలకిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ వీరయ్య, డాక్టర్ అంకయకుమార్

- కృషి విజ్ఞానకేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య
- కొలుమలపల్లెలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించినప్పుడే అధిక దిగుబడులు సాధించగలరని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. సికె. దిన్నె మండలం కొలుములపల్లె గ్రామంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఊటకూరు కేవీకే ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ పత్తి, పసుపు పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్ సమగ్ర సస్యరక్షణలో భాగంగా జిరుగు అట్టల వినియోగం, జీవ నియంత్రణ పురుగు మందుల ఆవశ్యకత గురించి వివరించారు. వృక్ష, శరీరం ధర్మ విభాగం సహాయ ఆచార్యులు వెంకటేష్‌బాబు మాట్లాడుతూ గత మూడేళ్లుగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తరగతి గదులలో తెలుసుకున్న అంశాలను ప్రత్యక్షంగా రైతుల పొలాలలో పరిశీలించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడిందని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త మానస తమలపాకు, పసుపు పంట, చీనీ, నిమ్మ పంటలలో ఎండు తెగులు నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులు సమీకృత వ్యవసాయ పద్ధతులు, నేల మరియు నీటి సంరక్షణ పద్ధతులు, సోలార్ ఫెన్సింగ్ అంశాలపై విత్తనాల చార్ట్‌లను, మోడల్స్‌ను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే విస్తరణ శాస్త్రవేత్త మహేష్‌బాబు, మహానంద వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కొలుమలపల్లె, దుగ్గాయపల్లె, పెద్దపుత్త గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఈవీఎం ధ్వంసంపై అనుమానాలు

రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి



పోరుమామిళ్ల : మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం పగలకొట్టారనే వీడియో టీడీపీ నేత నారా లోకేష్ ట్విట్టర్‌లోకి ఎలా వచ్చిందని పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి ప్రశ్నించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా 9 చోట్ల ఈవీఎంలు పగలకొట్టారని ఎన్నికల కమిషనర్ తెలిపినా, ఎక్కడా ఎవరిపై కేసు నమోదు చేయలేదన్నారు. పోలింగ్ సందర్భంగా బయట వ్యక్తులకు వీడియో తీసేందుకు అనుమతి లేదని, అయినా 20 తర్వాత రామకృష్ణారెడ్డి ఈవీఎం పగుల కొట్టినట్లు చూపారే గానీ, పూర్తి వీడియో ఎందుకు బయటపెట్టడం లేదన్నారు. ఏజెంట్లను బయటకు లాగి దాడి చేయడం, వారు ఆసుపత్రి పాలు కావడం నిజం కాదా అని ప్రశ్నించారు. 20వ తేదీ వరకు మాచర్లలో ఉన్నా పిన్నెల్లిపై కేసు లేదని, లోకేష్ వీడియో తరువాత కేసు నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎన్నికలకు ముందే హైకోర్టును ఆశ్రయించి ఎక్కడైతే పోలింగు సాఫీగా జరగదని భావించారో తెలిపారని, ఎన్నికల అధికారికి రామకృష్ణారెడ్డి రాతపూర్వకంగా ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. టీడీపీనేత చదలవాడ ఆసుపత్రిలో మారణాయుధాలు, పెట్రోలు బాంబులు దొరకడంపై పోలీసు కేసు నమోదు చేయకపోవడం గురించి సిట్ అధికారులకు తెలిపారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై పోలింగ్ రోజున ఒడిషా నుంచి వచ్చిన అల్లరి మూకలు, బౌన్సర్లు దాడిచేసి కార్లు, ఫర్నిచర్ ధ్వంసం చేశారని, ఎమ్మెల్యే మామ కోటిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై పోలీసులే దాడి చేసి సీసీ కెమెరాలు, ఫర్నిచర్, కంప్యూటర్స్ ధ్వంసం చేశారన్నారు. చంద్రబాబు సూచన మేరకు నిమ్మగడ్డ రమేష్, వర్ల రామయ్య, పురంధేశ్వరి ద్వారా అనుకూలమైన అధికారులను నియమించడం వల్లే విధ్వంసం జరిగిందన్నారు. ఘర్షణలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగార్జునరెడ్డి కోరారు.

నిధి పోర్టల్ ద్వారానే కార్యకలాపాలు

పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలూ నాయక్



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలూనాయక్

కడప సెవెన్‌రోడ్స్ : సీఎఫ్‌ఎంఎస్ స్థానంలో వచ్చిన నిధి పోర్టల్ ద్వారానే ఇక మీదట కార్యకలాపాలు జరగాలని పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలూనాయక్ అన్నారు. కడపలో నిర్వహించిన పంచాయతీరాజ్ ఇంజనీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీపీఆర్‌ల తయారీ, పరిపాలనాపరమైన, సాంకేతిక అనుమతులు, ఈఎంబుక్, పనుల రికార్డింగ్, పేమెంట్స్ అన్నీ ఇకపై ఫిజికల్‌గానేగాక ఆన్‌లైన్ ద్వారా జరగాలని చెప్పారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు ఇంకా పైలెట్ ప్రాజెక్టు దశలోనే ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ విభాగం డిజిటలైజేషన్ అవుతోందని, దీంతో అక్రమాలకు ఆస్కారం ఉండదన్నారు. జోన్-2లోని విజయవాడ, జోన్-3లోని గుంటూరులో జోనల్ ఇంజనీర్ల వర్క్‌షాప్ నిర్వహించి క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలు తెలుసుకున్నామని చెప్పారు. ఈ నెల 25న జోన్-1లోని విశాఖపట్టణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిధి పోర్టల్, టెంప్లేట్స్ సర్కిళ్ల పునర్వ్యవస్థీకరణ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, ఆంధ్రప్రదేశ్ రూరల్, రోడ్స్ ప్రాజెక్టు గ్రాంట్స్ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇంజనీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ. శ్రీనివాసులురెడ్డి, చీఫ్ ఇంజనీర్లు అమర్‌నాథరెడ్డి, కృష్ణారెడ్డి, అనంతపురం, కర్నూలు, చిత్తూరు పర్యవేక్షక ఇంజనీర్లు వీరస్వామి, సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఈలు, డీఈలు పాల్గొన్నారు.

చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్ ప్రారంభం



చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాగరాజు, సురేశ్వర్‌రెడ్డి

కడప రూరల్ : కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్ ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీతో జీవిస్తున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఇక్కడ చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్‌ను ప్రారంభించేందుకు వైఆర్‌జీ కేర్ సహకారం ఇవ్వడం అభినందనీయమన్నారు. చిన్న పిల్లలు ఇక్కడ లభించే సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కౌన్సెలింగ్, న్యూట్రిషన్, గ్రోత్ మానిటరింగ్, జనరల్ హెల్త్ చెకప్‌తోపాటు ఇతర సేవలు కేంద్రంలో లభిస్తాయన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవిబాబు మాట్లాడుతూ పిల్లలను తరుచుగా ఏఆర్‌టీ సెంటర్‌కు తీసుకువచ్చి, వారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేలా పౌష్టికాహారం, మాత్రలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం భాస్కర్, తంబురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం





అశ్వవాహనంపై గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరుడు, పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి అలంకరించారు. గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అశ్వ వాహనంపై ఊరేగించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు చేసి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం కొవ్వూరు రమేష్‌రెడ్డి, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తంబళ్లపల్లె : మినీ టెంపో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.., గుండ్లపల్లె పంచాయితీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చలపతి(45), మలిగివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి(60) ద్విచక్ర వాహనంలో సొంత పనుల కోసం తంబళ్లపల్లెకు బయలుదేరారు. చెన్నప్పగారిపల్లె మలుపులో ఎదురుగా వచ్చిన మినీ టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యంకోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు..

మదనపల్లె : ఈడిగపల్లె పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన కేశవ భార్య జి.ఉమాదేవి(30) తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో టమాటా కోసేందుకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఉమాదేవి తీవ్రంగా గాయపడగా, గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

కనుల పండువగా నరసింహుని కల్యాణం





వెయ్యినూతలకోనలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం వెయ్యినూతల కోన పుణ్య క్షేత్రంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు ఈ కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్తులు కోనేర్లల్లో స్నానాలు అచరించి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం గజవాహన సేవ, సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామిని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఆలయ అవరణంలో భక్తులకు దాతలు అన్నదానం ఏర్పాటుచేశారు.

ఖజానా కుంభకోణం దర్యాప్తునకు బ్రేక్

డీఎస్పీకి బాధ్యతలు అప్పగించిన ఎస్పీ

బి.కొత్తకోట : ఏఐఎన్, పాన్, టీఏఎన్ కార్డులు దుర్వినియోగం చేసి కోట్లలో జరిగిన ట్యాక్స్ రీ ఫండ్ కుంభకోణం కేసు దర్యాప్తునకు బ్రేక్ పడింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, వాయల్పాడు సబ్ ట్రెజరీ కార్యాలయాల పరిధిలో సాగిన ఈ కుంభకోణం అప్పట్లో సంచలనం కలిగించింది. అనంతరం 2022 డిసెంబర్, 13న తిరుపతి ఆదాయ పన్ను శాఖ అధికారి రాజశేఖర్ మదనపల్లె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడం, అదే రోజున సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేయడంతో దర్యాప్తు మొదలైంది. ఆ తర్వాత కేసు తీవ్రత, లోతైన దర్యాప్తు, ఆధారాల సేకరణ, విచారణ వ్యవహారాలు కుంభకోణంలో అనుమానాలు రేకెత్తించడంతో అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మదనపల్లె డీఎస్పీని దర్యాప్తు అధికారిగా నియమించారు. సాధారణంగా ఉద్యోగులు చెల్లించిన వేతనాల పన్ను మొత్తం తిరిగి పొందేందుకు నిబంధనలు ఉంటాయి. ఆదాయ పన్నును తిరిగి ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ఉద్యోగుల ఖాతాకు జమవుతుంది. అయితే కొందరు అధికారులు, ప్రైవేటు ఆడిటర్లు కుమ్మక్కై ఏఐఎన్, పాన్, టీఏఎస్ కార్డులతో చెల్లించిన పన్నులకు మించి భారీ మొత్తాలను రీఫండ్‌గా పొందారు. తంబళ్లపల్లె ఎస్‌టీఓ కార్యాలయంలో రీఫండ్ చెల్లించినట్టు గుర్తించగా, పీలేరు, మదనపల్లె, మరిన్ని ఎస్‌టీఓ కార్యాలయాల్లోనూ ఈ కుంభకోణం ఆనవాళ్లు గుర్తించి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా గతేడాది ముగ్గురు అధికారులు, ఓ ఆడిటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం రాజకీయ పర్యటనల్లో నెలకొన్న పరిస్థితులు, ఎన్నికలు, నేతల పర్యటనలతో ఈ కేసు దర్యాప్తు ఆగింది.

అందని ఎఫ్ఎస్ఎల్ నివేదిక

ఎన్నికల ఫలితాల తర్వాత కేసు విచారణ వేగవంతం కానుంది. ఈ కేసులో కంప్యూటర్లు, సాంకేతిక పరికరాలు, సిమ్‌లను స్వాధీనం చేసుకుని విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. నివేదిక ఇంకా అందలేదని తెలిసింది.

లారీ, బైక్ ఢీ - ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పసుపులేటి సుబ్బనరసయ్య, గాయపడిన తోట వెంకటరమణ

పుల్లంపేట : మండలంలోని కడప-తిరుపతి జాతీయ రహదారి అప్పయ్యరాజుపేట పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే పెనగలూరు మండలం, కొండూరు గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బనరసయ్య, తోట వెంకటరమణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పసుపులేటి సుబ్బనరసయ్య మృతిచెందగా తోట వెంకటరమణ గాయపడ్డాడు. క్షతగాత్రుని హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

మదనపల్లె : అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. స్థానిక బుగ్గకాలువకు చెందిన నారాయణస్వామి కుమారుడు ఎం.గంగాధర్(35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆటోను తనకు ఇచ్చేయాలని తమ్ముడు మురళి గొడవకు దిగి, కర్రతో అన్నపై దాడి చేశాడు. ఈ దాడిలో గంగాధర తలకు తీవ్రగాయం కాగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



చిన్నారి మృత దేహాన్ని తీసుకెళ్తూ రోదిస్తున్న కుటుంబసభ్యులు

మదనపల్లె : ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీ రహమత్ నగర్‌కు చెందిన సాదిక్ బాషా, సనా దంపతుల రెండో సంతానం ఎస్.మన్నా ఫాతిమా(2). శుక్రవారం ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ అక్కడే ఉన్న నీటి సంపులో పడింది. కుటుంబసభ్యులు హుటాహుటిన బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు విలపించడం ఆస్పత్రిలో పలువురినీ కలచివేసింది. చిన్నారి మృత దేహాన్ని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లిపోగా, ఆస్పత్రి అవుట్ పోస్ట్ సిబ్బంది పోలీసులుక సమాచారం అందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

ఎర్రగుంట్ల: మండలంలోని చిలంకూరు-నిడుజివ్వి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎస్.కుల్లాయప్ప(40) దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. యర్రగుంట్ల పోలీసుల వివరాల మేరకు.. యర్రగుంట్ల- కడప రోడ్డులోని మహేశ్వనగర్ కాలనీలో సంపంగి కుల్లాయప్ప(40) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం చిలంకూరుకు పోయి స్కూటర్‌లో యర్రగుంట్లకు తిరిగి వస్తుండుగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కుల్లాయప్ప అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లికి చెందిన రాగలకుమార్(37) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు.. రాగలకుమార్ పలు చోట్ల అప్పులు చేస్తుండటంతో తండ్రి రాంమూర్తి మందలించాడు. ఇది జీర్ణించుకోలేక జీవితంపై విరక్తి పెంచుకున్న రాగలకుమార్ శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి మహిళా కూలి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన పెద్ద రామాంజులు భార్య టి.వెంకటలక్ష్మ(34) కూలిపనుల్లో భాగంగా మామిడి కాయలు కోసేందుకు వలసపల్లెకు వెళ్లింది. చెట్టులో నుంచి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుమీద నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చిన్నారికి గాయాలు

కలకడ : బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన కె.రాజశేఖర్ భార్య భాగ్యలక్ష్మి తన కుమార్తె స్పందన (3)ను శుక్రవారం ఉదయం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపింది. తిరిగి 12గంటల సమయంలో చిన్నారిని రోడ్డు వద్దనే వదిలివేయడంతో దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనం చిన్నారి స్పందనను ఢీకొంది. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన కుమార్తె గాయాలపాలయ్యారనిస్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILE

రన్నింగ్ కండిషన్‌లో ఉన్న 2010 మోడల్, 59 సీటింగ్ గల కాలేజి బస్సులు అమ్మబడును. మరియు 2016 ఆ తర్వాత మోడల్ బస్సులు కొనబడును. ☎9550675010, 9912445846

REAL ESTATE

HOUSE FOR SALE

మదనపల్లి ప్రశాంత్ నగర్ 7th క్రాస్ నందు D.No.3-145-9-6, తూర్పుముఖం గల 43 1/2 x 41 1/2 గల ఇల్లు అమ్మబడును.నో బ్రోకర్స్. సంప్ర: 9966770455.

SERIVCES

BUSSINESS OFFER

పెట్టుబడి పెట్టగల 7th-PG స్త్రీ/పు మా సంస్థ నిర్వహించు సెల్‌ఫోన్ ద్వారా సర్వే వ్యాపారములో భాగస్వాములుగా చేరి నెలకి అత్యధిక సంపాధన పొందగలరు. ఫోన్ 8179021318

CHANGE OF NAME

Shaik Dhoumiya అను నా పేరును Shaik Doulu Sab గా మార్చుకోబడినది. నా చిరునామా Shaik Doulu Sab S/o Sahik Jilpaheer R/o D.No.3A/42-11-1, S.N.Colony Rayachoty (Town & Mandal), Annamayya (District), A.P.

I, MUTHYALA SUBBAMMA (OLD NAME), R/O, D.NO. 2331, MANGALIMITTA, RAJAMPETA (T),(M), ANNAMAYYA (DT), A.P., HEREBY DECLARE THAT I HAVE CHANGED MY NAME AS MUTHYALA VENKATA SUBBAMMA (NEW NAME) W/O LATE SIVA RAMAIAH.

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 8500rs. మీ పేరు, కాల్ / వాట్సాప్ చేయగలరు. 9502615217

SBI లైఫ్ కడప బ్రాంచ్ నందు అడ్వైజర్‌గా మరియు ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆపైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు. మొబైల్ నెంబర్ : 9703388770

Wanted Teachers for Primary and high school all subjects. Pets, Music and dance Teachers at Thollagan gannapalli and Kamalapuram Branch. Cont: 7675920915

Wanted qualified and experienced faculties for English, Mathematics and Chemistry for Sri Sai Junior College in Rayachoty. Attractive Salary for the right person. Cont: 9441432981, 8019349545 Email: sreeram2981@gmail.com

ప్రముఖ రెస్టారెంట్ (రాయచోటి) నందు క్యాషియర్స్ కావలెను. ఫుడ్ మరియు రూమ్ సదుపాయం కలదు, షాపింగ్ మాల్ (కడప)లో పనిచేయుటకు డ్రైవర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సం.ప్ర: 8886153492, 9063064082.

ప్రముఖ బ్యాంకులలో పర్మినెంట్‌గా కం॥ ఆపరేటర్స్,క్లర్క్స్,అటెండర్స్,ఆఫీస్‌అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ కా॥ Qly: 10th - డిగ్రీ జీ॥ 28000/-, ఫోన్: 7981652556

యర్రగుంట్ల ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేయడానికి అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 10th పాస్, డిస్టెన్స్ 40 కి.మీ. పైన. వ: 40 సం॥ లోపు. PF + ESI వీక్లీ ఆఫ్ కలదు. ☎ 83746 14105, 92463 25282

ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో Job చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F). Age: 18 to 30. నో ఫీజు. సెల్: 9177342337.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలనగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.